నేతన్నకు అండగా..

- నేతన్న నేస్తం ఐదో విడత పంపిణీకి సన్నద్ధం
- లబ్ధిదారుల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- జూలై 9న అర్హుల జాబితా విడుదల


అంగరలో మగ్గంపై చీరను నేస్తున్న కార్మికురాలు

కపిలేశ్వరపురం: మారిన కాలంలో చేతి వృత్తులు ప్రాధాన్యత తగ్గుతూ వస్తోంది. చేనేత వృత్తినే జీవనాధారం చేసుకున్న కుటుంబాలను ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2019 నుంచి ఆదుకుంటోంది. అప్పటి నుంచి క్రమం తప్పకుండా నాలుగు విడతలుగా ఒక్కో కుటుంబానికి రూ.24 వేలు చొప్పున ఆర్థిక సాయం అందిస్తోంది. ఐదో విడత సాయం పంపిణీ ప్రక్రియ ప్రస్తుతం సాగుతోంది.

ఐదో విడత పంపిణీ ప్రక్రియ ఇలా

ఇప్పటి వరకూ ప్రభుత్వం నాలుగు విడతలుగా నేతన్న నేస్తం పంపిణీని విజయవంతంగా పూర్తి చేసింది. ఐదో విడత పంపిణీపై కసరత్తు ప్రారంభమైంది. జూన్ 20వ తేదీ నుంచి సచివాలయాల్లో దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. 21 నుంచి లబ్ధిదారుల నూతన దరఖాస్తుల పరిశీలన ప్రారంభమైంది. 30 నుంచి జూలై 5 వరకూ అభ్యంతరాలు స్వీకరించారు. జూలై 6, 7 తేదీల్లో అర్హుల జాబితాను ఖరారు చేసి జూలై 9న వెల్లడించనున్నారు.

క్షేత్రస్థాయిలో నేతన్నలిలా...

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలో 12 చేనేత సహకార సంఘాలు ద్వారా 4,039 మంది సభ్యులున్నారు. ఆయా సంఘాలు రూ.8,55,00,000 టర్నోవర్ వ్యాపారం సాగుతోంది. వీటికి తోడు ప్రైవేటు మాస్టర్ వీవర్సు ద్వారా మగ్గాలపై వస్త్రాల తయారీ సాగుతోంది.

క్రమం తప్పకుండా అందుతున్న సాయం

నేతన్న కుటుంబానికి నెలకు రూ.రెండు వేలు చొప్పున ఏడాదికి రూ.24 వేలు ఆర్థిక సాయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ నేతన్న నేస్తం పథకాన్ని 2019 డిసెంబర్ 21న ప్రారంభించింది. ఈ పథకం ద్వారా 2019లో తొలివిడతగా రూ.24 వేలు చొప్పున ఖాతాలకు జమ చేసింది. ఏడాది తర్వాత 2020లో ఇవ్వాల్సిన రూ.24 వేలు రెండో విడత సాయాన్ని కరోనా కష్టాలు నేపథ్యంలో మానవత్వంతో ఏడాది పూర్తికాకుండానే ఆరు నెలలకే సాయమందించింది. ఆ రెండు విడతల్లో రామచంద్రపురం నియోజకవర్గంలో 689 మంది, మండపేట నియోజకవర్గంలో 785 మొత్తం 1,474 మందికి రూ.48 వేలు ఆర్థిక సాయమందించింది. మూడో విడత సాయాన్ని 2021 ఆగస్టు 9న మండపేట నియోజకవర్గంలో 852 మందికి, రామచంద్రపురం నియోజకవర్గంలో 616 మందికి మొత్తం1,468 మందికి రూ.24 వేలు చొప్పున సాయమందించింది. నాలుగో విడతలో రెండు నియోజకవర్గాల్లో 1,491 మందికి రూ.3,57,84000 అందజేశారు.

సంఘాల సమస్యలకూ పరిష్కారం

చేనేత కుటుంబాలను నేతన్న నేస్తం పథకంతో ఆదుకుంటున్న ప్రభుత్వం చేనేత సంఘాలు ఎదుర్కొంటున్న సమస్యలూ పరిష్కరిస్తూ వస్తుంది. దీర్ఘకాలంగా ఉన్న ఆప్కో బకాయిలను చెల్లిస్తుంది. ఈ రెండు నియోజకవర్గాల్లో 12 సంఘాలుండగా రాయవరం మినహా 11 సంఘాలకు రూ.4,07,69,000 ఆప్కో బకాయిలు 2022 ఆగస్టు 19న చెల్లించింది. చేనేత సహకార సంఘాల నుంచి ప్రభుత్వం ఖరీదు చేసిన వస్త్రాల బకాయి సొమ్ము ఒకేసారి పెద్ద మొత్తంలో చెల్లించారు. డిసెంబర్‌లో మరికొంత బకాయిలను చెల్లించింది.

చేనేత సహకార సంఘాల్లో నేతన్నలిలా...

సహకార సంఘం	సంఘం సభ్యులు	నాలుగో విడత లబ్ధి పొందిన కుటుంబాలు
మండపేట	294	122
ఏడిద	212	57
రాయవరం	160	50
అంగర	711	282
నల్లూరు	400	111
నేలటూరు	370	223
హసనబాద	400	138
ఆదివారపుపేట	802	257
అర్ధంపల్లి	341	124
శివల	180	38
కాజులూరు	169	89
మొత్తం	4,039	1,491

బకాయిల చెల్లింపుతో..



ఆప్కో బకాయిలు చెల్లింపుతో నేత కార్మికులు సంతోషంగా ఉన్నారు. నగదు పరపతిపై పావలా వడ్డీ పథకం, రిబేటు పథకాలను కూడా అమలు చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నూతన చేనేత విధానం ప్రయోజనకరంగా ఉంటుందని విశ్వసిస్తున్నా. నేతన్న నేస్తం పథకంతో చేనేత కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయి.

– జి.శివరామకృష్ణ, చైర్మన్, గణపతి చేనేత సహకార సంఘం, అంగర

ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చడమే లక్ష్యం

- మంత్రి వేణు గోపాలకృష్ణ
- ఆర్యావటంలో జగనన్న సురక్ష కార్యక్రమం



ఆర్యావటం కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి వేణు


వెదురుమూడిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట

కాజులూరు: తన పాలనలో రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరాలన్నదే సీఎం జగనన్న ఆశయమని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. సోమవారం ఆర్యావటంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మంత్రి వేణుగోపాలకృష్ణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగనన్న పాలనలో కుల, మత, పార్టీల భేదం లేకుండా అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఏ కారణం చేతనైనా ఇంకా పథకాలు అందకుండా మిగిలిపోయిన లబ్ధిదారులు ఉంటే వారిని గుర్తించి తగిన న్యాయం చేయాలన్నదే ఈ కార్యక్రమ ఉద్దేశమన్నారు. 11 రకాల ధ్రువపత్రాలను ఈ కార్యక్రమంలో ఉచితంగా అందజేస్తామన్నారు. మండల తహసీల్దార్ సాయిసత్యనారాయణ మాట్లాడుతూ ఆర్యావటంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో కులధ్రువీకరణ పత్రాలు 528, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు 481, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం ఒకటి, పంటల సాగు హక్కుపత్రం ఒకటి మంజూరు చేశామన్నారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుత్తుల బుల్లిరాజు, జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకటసుబ్బారావు, ఎంపీపీ మాత భారతి, వైస్ ఎంపీపీ పెదిరెడ్డి వెంకటరమణ, రామచంద్రపురం వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ పండుల గోవింద రాజు, ఎంపీటీసీ సభ్యురాలు ఈశ్వరి, ఎంపీడీఓ ఐ.రత్నరాజు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో సామాజికాభివృద్ధి

కపిలేశ్వరపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో సామాజికాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. వెదురుమూడిలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ తోట లాంఛనంగా ప్రారంభించారు. గ్రామస్తులు ప్రస్తావించిన సాంకేతిక సమస్యలను జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, సర్పంచ్ చోడే రామలక్ష్మి, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కొమరం సూర్యారావులతో చర్చించారు. తొలుత గ్రామ సభలో ఏర్పాటు చేసిన సర్వీస్ రిక్వెస్ట్, హెల్ప్ డెస్క్‌లను పరిశీలించారు. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, కొమరం సూర్యారావు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల్లో లబ్ధి పొందాల్సిన వారి కోసం వలంటీర్లు సర్వే చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకూ వెదురుమూడి సచివాలయంలో 74 శాతం, నేలటూరు 76 శాతం, అంగర–2 66 శాతం, వడ్లమూరు 58 శాతం, కాలేరు సచివాలయంలో 64 శాతం పూర్తయిందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు పలివెల మధు, కార్యదర్శి వెలగల లక్ష్మి పాల్గొన్నారు.

సందడిగా జగనన్న సురక్ష

మండపేట: క్షేత్రస్థాయిలో అర్హత కలిగిన పేదల చెంతకే ప్రభుత్వ పథకాలను చేరవేయడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం మండపేట పట్టణ, మండల గ్రామాల్లో సందడిగా జరుగుతోంది.


కేశవరంలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ శ్రీనివాసు, సర్పంచ్ సత్యనారాయణ

సోమవారం స్థానిక 7వ వార్డులో కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం లబ్ధిదారులకు మంజూరైన ధ్రువీకరణ పత్రాలను చైర్‌పర్సన్ దుర్గారాణి పంపిణీ చేశారు. పట్టణంలోని 8, 18, 19 వార్డుల్లో జరిగిన సమావేశాల్లో చైర్‌పర్సన్ దుర్గారాణి పాల్గొని లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్, వైస్ చైర్మన్లు పిల్లి గణేశ్వరరావు, వేగుళ్ల నారయ్య, విప్ పోతంశెట్టి ప్రసాద్, కౌన్సిలర్లు మందపల్లి రవికుమార్, నాయుడు లక్ష్మీసౌజన్య, పార్టీ నాయకులు మందపల్లి రుద్రకాంత్, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మండలంలో..

కేశవరంలో గ్రామ సర్పంచ్ పెదపాటి వీరవెంకటసత్యనారాయణ అధ్యక్షతన పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమానికి ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. తహసీల్దార్ టీఆర్ రాజేశ్వరరావు, మండల పరిపాలన అధికారి వీఎస్ ప్రసాద్, ఏఎంసీ డైరెక్టర్ సమతం పాపారావు, కార్యదర్శి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ఏడిదలో గ్రామ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అధ్యక్షతన పంచాయతీ కార్యాలయం వద్ద జగనన్న సురక్ష శిబిరం జరిగింది. ఎంపీడీఓ ఐ రాజు, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, సొసైటీ చైర్మన్ రామిశెట్టి శ్రీహరిబాబు, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్ హాజరై లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. డిప్యూటీ తహసీల్దార్ పద్మ, ఎంపీటీసీ సభ్యులు చొల్లంగి రామారావు, పట్నాల నాగబాబు, కార్యదర్శి వుండమట్ల వీర్రాజు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు మానుకోవాలి

ఎమ్మెల్యే వేగుళ్లకు ద్వారపూడి నేతల హితవు


సమావేశంలో మాట్లాడుతున్న ఉప సర్పంచ్ శేషారావు, శ్రీరామవర్మ, రాంబాబు తదితరులు

మండపేట: తమ గ్రామాన్ని అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంచిన ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పంచాయతీపై అసత్య ఆరోపణలు మానుకోవాలని ద్వారపూడి పంచాయతీ పాలకవర్గం సభ్యులు హితవుపలికారు. గ్రామ ఉప సర్పంచ్ తులా శేషారావు, సొసైటీ చైర్మన్ దంతులూరి శ్రీరామవర్మ, పార్టీ సేవాదళ్ మండల కన్వీనర్ పోతుల రాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు పాండ్రంకి జటాధరుడు, వార్డు సభ్యుడు సంగిశెట్టి రమేష్ తదితరులు సోమవారం పంచాయతీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తమ పంచాయతీలో కోట్ల రూపాయల అక్రమాలు జరిగాయని ఎమ్మెల్యే వేగుళ్ల వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పంచాయతీ ఆదాయం రూ.కోటి లోపు ఉండగా సిబ్బంది జీతాలు, ఇతర ఖర్చులు కలిపి రూ.1.30 కోట్ల వరకూ వ్యయమవుతుంటే అక్రమాలకు ఆస్కారమేదని వారు ప్రశ్నించారు. తమ గ్రామంలోని చెరువుల నుంచి కోట్లాది రూపాయల విలువైన గ్రావెల్‌ను కొల్లగొట్టి మండపేటలో లే అవుట్లు వేసుకున్న ఘనత మీకే దక్కుతుందన్నారు. గత టీడీపీ హయాంలో తమ గ్రామంలో జరిగిన అవినీతి అక్రమాలు ప్రజలందరికీ తెలుసునని వారు పేర్కొన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు వచ్చాక ద్వారపూడి గ్రామం అభివృద్ధిబాట పట్టిందన్నారు. ఆయన కృషితో పలు ప్రభుత్వ గ్రాంట్లు తెచ్చి గ్రామంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. చిత్తశుద్ధిఉంటే గ్రామాభివృద్ధికి సహకరించాలని, అసత్య ఆరోపణలతో అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తే సహించేది లేదని ఉప సర్పంచ్ శేషారావు, సొసైటీ చైర్మన్ శ్రీరామవర్మ, రాంబాబు తదితరులు అన్నారు. వార్డు సభ్యులు గేవెల శ్రీనివాస్, సేనాపతి నాగమణి, సత్యవతి, గుర్రాల ఉమాదేవి, పార్టీ నాయకులు నామాల పెదవెంకన్న, తొంటా సత్తిపండు, పంతంగి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

గాలీవాన బీభత్సం

మండపేట: భానుడి భగభగలతో అల్లాడుతున్న జనజీవనానికి ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఉపశమనం కలిగించింది. సోమవారం సాయంత్రం మండపేట, పరిసర గ్రామాల్లో కారుమబ్బులు కమ్ముకుని, ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. గత కొద్ది రోజులుగా అధిక ఎండలు, వేడి గాలులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. సోమవారం ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు అల్లాడిపోయారు. సాయంత్రమయ్యే సరికి ఆకాశం మేఘావృతమై ఈదురుగాలులతో దాదాపు గంటపాటు కుండపోతగా వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలు, రోడ్లు జలమయమయ్యాయి.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఈదురుగాలుల ప్రభావంతో సాయంత్రం నాలుగు గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మండపేట, ఏడిద, ద్వారపూడి తదితర చోట్ల చెట్లు విరిగిపడ్డాయి. పట్టణంలోని ఆలమూరు రోడ్డులో చెట్టు రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. అర్తమూరు రోడ్డులో 33 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఒరిగిపోయింది. ఏడీఈ జి.తిరుమలరావు నేతృత్వంలో సిబ్బంది విద్యుత్ సమస్యలను పరిష్కించారు.

కె.గంగవరం: గత నాలుగు రోజులుగా ఎండ తీవ్రతతో ఇబ్బంది పడుతున్న జనం సోమవారం సాయంత్రం 4 గంటలకు కురిసిన వర్షానికి ఉపశమనం పొందారు. ఉదయం ఎండ మండిపోగా సాయంత్రం ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై కురిసిన వర్షం కురవడంతో వాతావరణ చల్లబడింది.

రాయవరం: మండలంలో సోమవారం భారీ వర్షం కురిసింది. సుమారు గంటపాటు కురిసిన వర్షంతో మండలంలోని పలు చోట్ల రహదారులు జలమయంగా మారాయి. భారీ వర్షంతో పాటు ఈదురుగాలులకు పలు చోట్ల చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి.

హామీలన్నీ అమలు చేసిన ఘనత జగన్‌దే..

- మంత్రి వేణు గోపాలకృష్ణ
- దుగ్గుదుర్రు గడపగడపకూ కార్యక్రమం


దుగ్గుదుర్రులో లబ్ధిదారులకు పథకాలు వివరిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

కాజులూరు: ఎన్నికల ముందు ప్రజలకు చేసిన హామీలన్నీ అధికారంలోకి వచ్చాక అమలు చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. సోమవారం రాత్రి దుగ్గుదుర్రులో మూడో రోజు మంత్రి వేణుగోపాలకృష్ణ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వలంటీర్లు, కార్యకర్తలతో ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరిని పలకరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతుందీ లేనిదీ ఆరా తీశారు. అనంతరం వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పాటుపడే జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించి మరోమారు అధికారంలోనికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాత భారతి మురళి, గ్రామ సర్పంచ్ పోతు వెంకటలక్ష్మి, పీఏసీఎస్ చైర్మెన్లు రేమళ్ళ చిట్టియ్యదొరా, సత్తి శ్రీరామారెడ్డి, రామచంద్రపురం వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ దంగేటి అరుణ్‌కుమార్ మాజీ ఎంపీటీసీ సభ్యుడు మాత సూకరావు, పోతు శ్రీనివాసు, నరాశా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా గురుపౌర్ణమి


సత్యవాడ సాయిబాబా ఆలయంలో బాబాను దర్శించుకుంటున్న బ్రహ్మయ్య తదితర భక్తులు


మండపేట శ్రీసీతారామ క్షేత్రంలో సాయిబాబాను దర్శించుకుంటున్న భక్తులు

మండపేట: మండపేట అర్బన్, మండల గ్రామాల్లో గురుపౌర్ణమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. భక్తులు సాయినాథున్ని దర్శించుకుని పూజలు నిర్వహించారు. పట్టణంలోని శ్రీసీతారామ క్షేత్రంలో ఉన్న సాయినాథునికి ఆలయ కమిటీ చైర్మన్ మల్లిపూడి గణేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 2000 మందికి స్వామివారి అన్న ప్రసాద వితరణ చేశారు. తర్వాణీ పేటలో ఉన్న సాయిబాబా ఆలయంలో అధిక సంఖ్యలో భక్తులు పూజలు చేశారు. మండలంలో ప్రసిద్ధి చెందిన అర్తమూరు, ద్వారపూడి, జెడ్ మేడపాడు, కేశవరం, ఏడిద, తదితర గ్రామాల్లోని గురుపౌర్ణమి వేడుకలు జరిగాయి.

కె.గంగవరం: మండలంలోని పాణింగపల్లి, పామర్రు, సత్యవాడ, కోటిపల్లి తదితర గ్రామాల్లో సోమవారం గురు పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఉన్న సాయిబాబ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సత్యవాడలోని సాయిబాబా ఆలయం వద్ద గ్రామానికి చెందిన మాకినీడి బ్రహ్మయ్య, వెంకటరమణ దంపతుల ఆధ్వర్యంలో మహిళలు భజనలు చేశారు.

విజయదుర్గా పీఠంలో..

రాయవరం: వెదురుపాక విజయదుర్గా పీఠంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా సాగాయి. ఉదయం వేదపండితులు విజయదుర్గ అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులతో పీఠం కిటకిటలాడింది. ఈ వేడుకల్లో పాల్గొన్న పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం(గాడ్) భక్తుల నుద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. పీఠం పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్(బాబి) ఆధ్వర్యంలో భక్తులకు ఘనంగా అన్నసమారాధన నిర్వహించారు. గురుపౌర్ణమి పూజల్లో రామచంద్రపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ దంపతులు, పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఠం ప్రతినిధులు గాదె భాస్కరనారాయణ, సత్యవెంకట కామేశ్వరి, పెద్దపాటి సత్యకనకదుర్గ, బలిజేపల్లి రమ, భక్తులు పాల్గొన్నారు. మండలంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి.

కౌలు బహిరంగ వేలం ప్రకటన

[illegible] ... 5000/-లు [illegible]

[illegible] ... రూ.1000/-లు [illegible]

కార్యనిర్వహణాధికారి

క్లుప్తంగా

దాతల సేవలను సద్వినియోగం చేసుకోవాలి

రాయవరం: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు తోడుగా దాతలు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకుని విద్యాభివృద్ధిని సాధించాలని పలువురు పేర్కొన్నారు. లొల్ల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేశారు. విశ్రాంత ఉపాధ్యాయుడు మల్లిడి బాలరాజు జ్ఞాపకార్థం కుమార్తె, పాఠశాల ఉపాధ్యాయిని చంద్రకళ, కుటుంబ సభ్యులు రూ.15వేలు విలువైన నోట్ పుస్తకాలను అందజేశారు. పాఠశాల హెచ్ఎం కొవ్వూరి నాగిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ చాట్రాతి జానకిరాంబాబు, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ చేవా సత్యనారాయణ, విశ్రాంత ఉపాధ్యాయుడు పాతూరి అప్పారావు తదితరులు దాతల సేవలను ప్రశంసించారు. కూర్మాపురంలో మండల పరిషత్–1 ప్రాథమిక పాఠశాలలో సోమవారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. పసలపూడి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత ద్వారంపూడి రామచంద్రారెడ్డి సౌజన్యంతో ఈ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు.

250 మందికి వైద్య పరీక్షలు


రోగులకు మందులు అందజేస్తున్న హాస్యనటులు, మురళీధర్, చిట్టిబాబు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలో భీమేశ్వర దంత వైద్యశాల 13వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నిర్వహించిన ఉచిత మెగా దంత వైద్య శిబిరంలో డాక్టర్ బచ్చు క్రాంతికుమార్, డాక్టర్ త్రినాథ్, అల సుబ్రహ్మణ్యం సుమారు 250 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. వైద్య శిబిరానికి ప్రత్యేక అతిథులుగా విచ్చేసిన హాస్య నటులు మురళీధర్, చిట్టిబాబుల చేతుల మీదుగా మందులు, టూత్ పేస్టులు అందజేశారు.

నేడు జగన్నాయకులపాలెంలో 'జగనన్న సురక్ష'

రామచంద్రపురం రూరల్: జగన్నాయకులపాలెంలో మంగళవారం ఉదయం 9 గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పాల్గొంటారని క్యాంపు కార్యలయ సిబ్బంది సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు కాజులూరు మండలం చేదువాడలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందన్నారు.

రోటరీ అసిస్టెంట్ గవర్నర్‌గా శశిధర్‌రెడ్డి



మండపేట: రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్‌గా పట్టణానికి చెందిన ప్రముఖ దంత వైద్య నిపుణులు తాడి శశిధర్‌రెడ్డి నియమితులయ్యారు. గతంలో మండపేట రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా ఆయన ఎన్నో సేవలు అందించారు. ప్రస్తుతం మండపేట, పందలపాక, ముమ్మిడివరం, అమలాపురం పరిధిలోని రోటరీ క్లబ్‌లకు అసిస్టెంట్ గవర్నర్‌గా నియమితులయ్యారు. శశిధరరెడ్డికి రోటరీక్లబ్ ప్రముఖులు నల్లమిల్లి వెంకటకృష్ణారెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, బిక్కిన చక్రవర్తి, బొబ్బా రామకృష్ణ, విజ్ఞాన్ రాంబాబు అభినందనలు తెలిపారు.

చోరీ కేసుల్లో నిందితులకు జైలు

కపిలేశ్వరపురం: మోటారు బైక్‌లను చోరీ చేసినట్టు నమోదైన పలు కేసుల్లో నేరం రుజువు కావడ,తో ముద్దాయిలకు జైలు శిక్షను విధిస్తూ ఆలమూరు జేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి డాక్టర్ కె.దీపదైవ కృప తీర్పు చెప్పారు. మండపేటకు చెందిన తమ్మన వీవీఎస్ సుబ్రహ్మణ్యం 2021 సెప్టెంబర్ 6న తన మోటారు సైకిల్ చోరీకి గురైందంటూ అంగర పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే గ్రామానికి చెందిన తోరాటి రాంబాబు తన బైక్ పోయిందంటూ 2021 సెప్టెంబర్ 17న ఫిర్యాదు చేశారు. ఇలా ఐదు కేసులు నమోదయ్యాయి. ఆయా ఫిర్యాదులపై అప్పటి ఎస్సై బి.సంపత్‌కుమార్ కేసును నమోదు చేశారు. కోర్టు విచారణలో ముద్దాయిలు ఏపుగంటి దుర్గా ప్రసాద్, తొగరు సురేష్, పెదపాటి మణికుమార్ నేరం చేసినట్టు రుజువైంది. దీంతో ముద్దాయిలు ఒక్కొక్కరికీ ఏడాది జైలు, రూ.వెయ్యి చొప్పున జరిమానా విధిస్తూ ఆలమూరు జేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి దీపదైవకృప సోమవారం తీర్పు చెప్పారు. ఐదు కేసుల్లో ముద్దాయిలకు శిక్షను విధించినట్టు, బాధితుల తరఫున ఏపీపీ విశ్వ శ్రీరాములు వాదించారని అంగర ఎస్సై జి.చంటి తెలిపారు.

మండపేటలో చోరీ

మండపేట: పట్టణంలోని శెట్టిబలిజ కల్యాణ మండపం సమీపంలోని వస్త్ర వ్యాపారి ఇంటిలో చోరీ జరిగినట్టు తెలిసింది. రెండు రోజుల క్రితం ఇంటికి తాళం వేసుకుని కుటుంబమంతా హైదరాబాద్ వెళ్లినట్టు సమాచారం. సోమవారం ఇంటి తాళాలు పగలుగొట్టి లోపల వస్తువులు చిందరవందరగా పడి ఉండడంతో స్థానికులు పట్టణ పోలీసులకు సమాచారం అందించినట్టు తెలిసింది. హైదరాబాద్ నుంచి వస్త్ర వ్యాపారి కుటుంబం వచ్చాక చోరీ వివరాలు తెలుస్తాయంటున్నారు. ఈ విషయమై పట్టణ ఎస్ఐ ఎం.అశోక్‌ను సంప్రదించగా బాధితులు ఎవరూ తమకు ఫిర్యాదు చేయలేదన్నారు.

రాయవరం ఎంఈవో–1గా మూర్తి బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న రామలక్ష్మణమూర్తి

రాయవరం: స్థానిక మండల విద్యాశాఖాధికారి–1గా ప్రత్తి రామలక్ష్మణమూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా విధులు నిర్వర్తిస్తున్న రామలక్ష్మణమూర్తి ఆదివారం కాకినాడ ఆర్‌జేడీ కార్యాలయంలో జరిగిన ఎంఈవో–1 కౌన్సిలింగ్‌లో రాయవరం మండలం ఎంఈవో–1గా కోరుకున్నారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఎంఈవో–1గా విధులు నిర్వర్తించిన రామచంద్రపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం కె.వివేకానంద కాజులూరు మండల ఎంఈవోగా వెళ్లారు. ఈ సందర్భంగా రామలక్ష్మణమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యతల ప్రకారం రాయవరం మండలాన్ని విద్యాపరంగా ముందుకు తీసుకువెళతానన్నారు.

ఎమ్మెల్సీ తోట పరామర్శ

కపిలేశ్వరపురం: పుత్ర వియోగంతో బాధపడుతున్న కేదారిలంక గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త మీసం చిన్నాను సోమవారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పరామర్శించారు. గ్రామంలోని చిన్నా ఇంటికి వెళ్లి ఓదార్చారు. ఆయన సర్పంచ్ వీధి వెంకటరెడ్డి, ఎంపీటీసీ యర్రంశెట్టి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పోలిశెట్టి గణేష్, నాయకులు ఉన్నారు.

స్పందనకు 6 అర్జీలు

రామచంద్రపురం: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి మొత్తం 6 అర్జీలు వచ్చాయి. ఆక్రమణలు తొలగించాలని రెండు, భూ సమస్యలు సరిహద్దు తగదాలు తీర్చాలని రెండు, ఏ అగ్రహారంలో శ్మశాన వాటికను ఏర్పాటు చేయాలని ఒకటి, సీనియర్ సిటిజన్స్‌కు సంబంధించి ఒక అర్జీ అందాయని అధికారులు తెలిపారు. వాటిని ఆయా శాఖల అధికారులకు పంపించామన్నారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని వినతి

రామచంద్రపురం రూరల్: గ్రామంలో శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కోరుతూ అంబికపల్లి అగ్రహారం గ్రామస్తులు స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం వినతి పత్రం అందజేశారు. గ్రామంలో శ్మశాన వాటిక లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరైనా చనిపోతే చోడవరం గ్రామంలోని శ్మశాన వాటికకి తీసుకుని వెళ్లవలసి వస్తుందని, దహన సంస్కారాలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు.

నేడు మండపేటలో గడప గడపకూ

మండపేట: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మంగళవారం పట్టణంలోని 19వ వార్డులో పర్యటించనున్నట్టు పార్టీ కార్యాలయ కార్యదర్శి టపా పుల్లేశ్వరరావు తెలిపారు. సాయంత్రం 4.30 గంటలకు వల్లూరి వారి వీధి నుంచి మొదలయ్యే కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొనాలన్నారు.